క్లుప్తంగా

జగనన్న మళ్లీ సీఎం కావాలని పూజలు



ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బేస్తవారిపేట: స్థానిక దరగా రోడ్డులోని వీరాంజనేయస్వామి ఆలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని, గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా కేపీ నాగార్జునరెడ్డి, ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి 101 టెంకాయలు కొట్టారు. అభిషేకాలు, ఆకుపూజ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండా రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.వెంకటరాజు, ఎంపీటీసీ వెన్నా భాస్కర్‌రెడ్డి, వార్డ్ మెంబర్‌లు పాల్గొన్నారు.

గ్రామాల్లో 144 సెక్షన్ అమలు



రేగుమానిపల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

కొనకనమిట్ల: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 4వ తేదీన అన్నీ గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరావు అన్నారు. మండలంలోని రేగుమానిపల్లి, గుర్రాలమడుగు, మర్రిపాలెం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ప్రజలెవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. ఒకరికొకరు రెచ్చగొట్టే మాటలు మాట్లాడి గొడవలకు పాల్పడితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



గీసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, క్యారమ్స్, చదవడం, రాయడం, కథలు చెప్పడంపై శిక్షణ ఇచ్చారు. వేసవి శిక్షణ తరగతులకు 26 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వేమయ్య స్వామి ఆరాధన



వేమయ్యస్వామి దర్శనం చేసుకుంటున్న మహిళలు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడులో వేమయ్య స్వామి 262 ఆరాధన మహోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ అర్చకులైన డి.శ్రీనివాసులు, డి.బ్రహ్మం ఉదయం నాలుగు గంటలకు గణపతి పూజ, అభిషేకం, అఖండస్థాపన, అంకురారోపణం, మండల అవాహం కార్యక్రమాలను నిర్వహించి స్వామి ప్రత్యేక అలంకరణలతో పాటు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం ఆకవీడు, చినగానిపల్లె, చోళ్లవీడు, అక్కపల్లె, జేపీ చెరువు, అచ్చంపేట, ఆరవీటికోట గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తమ భక్తి చాటుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు ప్రారంభించారు. సాయంత్రం 5 గంటలకు వేమయ్య స్వామి కోలాట బృందం, నెమలిగుండ్లరంగనాయకస్వామి వారి చెక్క భజన బృందాన్ని ఏర్పాటు చేశారు.

నేడు గుంటిగంగలో 'సుహాసినీ' పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం గుంటిగంగా భవాని అమ్మవారి ఆలయంలో ఏకాదశి ఆదివారం రోజున 108 మంది ముత్తైదువులతో అత్యంత భక్తిశ్రద్ధలతో సుహాసినీ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. సుహాసినీ పూజా కార్యక్రమంలో పాల్గొనదలిచిన భక్తులు ముందుగా ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. పూజా కార్యక్రమంలో పాల్గొంటే సకల సౌభాగ్యాలు కలిగి, భర్తల అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని ఆలయ పూజారులు తెలిపారు.

వైభవంగా హనుమాన్ జయంతి

బేస్తవారిపేట: మండలంలోని బేస్తవారిపేట జంక్షన్, మర్రిచెట్టు వీధి, దరగా రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి, పూసలపాడు, పిటికాయగుళ్ల, చెట్టిచర్ల, పందిళ్లపల్లెలో ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, సహస్త్ర నామార్చనలు, ఆకుపూజలు వేదపండితుల ఆధ్వర్యంలో చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అర్థవీడు (బేస్తవారిపేట): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేస్వామి, రాములవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామికి ఆకు పూజ, అభిషేకాలు చేశారు. పానకం, వడపప్పు స్వామివారి నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంచి పెట్టారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మార్కాపురం రూరల్: హనుమత్ జయంతి సందర్భంగా మార్కాపురం మండలంలోని చింతగుంట్ల, ఎల్‌బీఎస్ నగర్, గజ్జలకొండ గ్రామాల్లోని ఆలయాల్లో అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి ఆకుపూజలతో పాటు ప్రత్యేకంగా వడమాల చేసి అలంకరించారు. వివిధ ప్రాంతాల్లో భక్తులకు అన్నదానం చేశారు. గజ్జలకొండలో అర్చకులు శేఖర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహానికి ఆకుపూజతో పాటు ప్రత్యేక అలంకరణ చేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొమరోలు: మండల కేంద్రం కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంతో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.



కొమరోలు: పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి



గజ్జలకొండలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



అర్థవీడులో పూజలు చేస్తున్న సర్పంచ్ వసంతమ్మ



బేస్తవారిపేట జంక్షన్‌లో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

గిద్దలూరు రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రేడియో బావి సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా భక్తులను అలరించారు. రాచర్లగేటు సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. చిన్నారులు కోలాటం నృత్య ప్రదర్శనలు చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కొత్తపల్లె, పాదలకుంపల్లె, కె.ఎస్.పల్లె, ముండ్లపాడు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పవనసుతా పాహిమాం



గొట్లగట్టులో శోభాయాత్ర ఉత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

● వైభవంగా హనుమాన్ జన్మోత్సవ వేడుకలు

కొనకనమిట్ల: హనుమాన్ జన్మోత్సవ పండుగ ఉత్సవాలను మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భక్తుల కోలాహలం నడుమ వైభవంగా నిర్వహించారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, నాయుడుపేట, చినమనగుండం, నాగంపల్లి, పాతపాడు, వింజవర్తిపాడు, మర్రిపాలెం, గరిమినపెంట, నాగిరెడ్డిపల్లి, సిద్దవరం, రేగడపల్లి గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తుల జయజయ ధ్వానాలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు నైవేద్యాలు సమర్పించి తమ భక్తి చాటుకున్నారు. గొట్లగట్టు అభయాంజనేయస్వామి ఆలయంలో వేదపండితులు వినుపాముల రామకృష్ణశర్మ, శేఖరశర్మల పర్యవేక్షణలో సువర్చలా సమేత అభయాంజనేయస్వామికి తమలార్చన ఆకుపూజా, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. తొలుత గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర చేశారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రం, రేగడపల్లి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు జరిపించారు. పంచముఖ ఆంజనేయస్వామికి, ధ్వజస్తంభాల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

కౌంటింగ్ సందర్భంగా ప్రత్యేక భద్రతా చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై రెహమాన్

మార్కాపురం: ఈనెల 4వ తేదీ జరగనున్న కౌంటింగ్ సందర్భంగా మార్కాపురం పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ రెహమాన్ తెలిపారు. పట్టణంలో 51 సీసీ కెమెరాలతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీతో పనిచేసే డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేయడంతో పాటు మొత్తం టౌన్ మూడు రూట్లుగా విభజించి మొబైల్ పార్టీలతో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని, ఎక్కడైనా అల్లర్లు జరిగిన వెంటనే నిముషాల్లో ఆ ప్రాంతానికి చేరేలా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో 144 సెక్షన్‌తోపాటు 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ప్రజలందరూ కౌంటింగ్ తరువాత వెలువడే ఫలితాలను బట్టి సమన్వయం పాటించాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు, పార్టీ జెండాలతో ర్యాలీగా వెళ్లడాలు, బాణసంచా కాల్చడం, గుంపులుగా ఉండి రంగులు చల్లుకోవడాన్ని అనుమతించబోమని ఆయన తెలిపారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవునికి శాంతి కళ్యాణం



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్యరంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలంకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీ.కెశవరావు, ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సత్వర పరిష్కారం చూపాలి

● ఎంపీపీ భూలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి

తర్లుపాడు: తాగునీరు, ప్రజా సమస్యలపై అధికారులు సత్వర పరిష్కారం చూపాలని ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు కేటాయించిన జూనియర్ కళాశాలలో నేటి విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్లు ఆమె తెలిపారు. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని విద్యార్థులు అధిక సంఖ్యలో చేరేలా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

దర్శి: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి తమ మానవత్వాన్ని చాటుకున్న సంఘటన మండలంలోని కాశీనాయన వృద్ధాశ్రమంలో శనివారం జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు ఆశ్రమంలో అనాథ వృద్ధుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, దారం వాసుదేవరెడ్డిలు ఆయన మృతదేహానికి అంత్యక్రియలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆశ్రమ నిర్వాహకులు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మిరెడ్డిలు అభినందిచారు.

రక్తదానం మహాదానం

● ఏపీజీబీ రీజినల్ మేనేజర్ రఘురామ్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు, పక్కన ఆర్ఎం రఘురామ్

మార్కాపురం: రక్తదానం మహాదానమని, ఆపదలో ఉన్నవారికి, క్షతగాత్రులకు రక్తం అవసరం చాలా ఉంటుందని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు రీజినల్ మేనేజర్ రఘురామ్ అన్నారు. శనివారం ఏపీజీబీ 19వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ కార్యాలయంలో జీజీహెచ్‌లో బ్లడ్‌బ్యాంకు సహకారంతో రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ రఘురామ్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1632 కోట్ల డిపాజిట్లు సేకరించామని, రూ.2360 కోట్ల రుణాలను లబ్ధిదారులకు అందించామని తెలిపారు. డిపాజిట్లపై అన్నీ ప్రభుత్వ బ్యాంకుల కంటే ఏపీజీబీ ఖాతాదారులకు అధిక వడ్డీ ఇస్తుందన్నారు. ప్రగతి కుబేర్ డిపాజిట్‌పై 444 రోజులకు అత్యధిక వడ్డీ 7.5 శాతం ఇస్తున్నామని, సీనియర్ సిటిజన్లకు 8 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ, మహిళలకు అదనంగా 0.05 శాతం వడ్డీ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ మేనేజర్ ఎం సంతోష్‌కుమార్, ఎం సందీప్, కే వెంకటసాయి, స్వాములు, తర్లుపాడు బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణారావు, మార్కాపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్లు, జార్జి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ రాజజయరావు పాల్గొన్నారు.

ఎన్నికల లెక్కింపునకు సహకరించాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం: ఒంగోలులో ఈనెల 4వ తేదీన జరుగుతున్న కౌంటింగ్ ప్రక్రియలో అందరూ సహకరించాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా కోరారు. శనివారం ఆర్‌ఓ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులు కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ఏజెంట్లు అందరూ తమకు నిర్దేశించిన సమయానికి కౌంటింగ్ హాలు వద్దకు చేరుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ గుర్తింపు కార్డులు వెంట తెచ్చుకోవాలని అన్నారు. సెల్‌ఫోన్‌లు, పెన్నులు కౌంటింగ్ హాలులోకి అనుమతి లేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏవైనా డౌట్లు ఉంటే తమ దృష్టికి తేవాలని, గొడవలు చేయడం , గట్టిగా అరవడం చేస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ హాలులోకి వచ్చిన తరువాత ప్రక్రియ ముగిసే వరకూ అక్కడే ఉండాలన్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు అనంతరం 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. పటిష్టమైన బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. సమావేశంలో డీఎస్పీ బాలసుందరరావు, ఏఆర్‌ఓ తహశీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాల పరిశీలన



గొట్లగట్టులో మీ సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం, కొనకనమిట్ల గ్రామాల్లోని పలు మీ సేవా కేంద్రాలను డీఎల్‌డీఓ సాయికుమార్ శనివారం పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అంశాలకు సంబంధించి రికార్డులు, మీ సేవా కేంద్రాలు అమలు చేసే విధానాన్ని పరిశీలించారు. తొలుత ఆయా గ్రామాల గ్రామ సచివాలయాలను పరిశీలించి సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. సమయ పాలన పాటించి సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామ సమస్యలపై ఎప్పటికప్పుడు తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సాయికుమార్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

కౌంటింగ్ రోజున అల్లర్లు సృష్టిస్తే జైలుకే



బొడిచర్లలో వాహనాల పత్రాలను తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై నాయక్

మార్కాపురం రూరల్: జూన్ 4వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు సృష్టిస్తే జైలుకు పంపుతారని మార్కాపురం సీఐ అవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని బొడిచర్ల గ్రామంలో శనివారం ఆకస్మికంగా గ్రామాన్ని తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ కౌంటింగ్ రోజున మండలంలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అల్లర్లకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తే యువత వారి జీవితాలను కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి రోజూ పోలీసులు తనిఖీ చేపడతారని అన్నారు. ఈయన వెంట రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

పెద్దారవీడు: ఉపాధి హామీ పథకం ద్వారా పనుల్లో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అర్జున్‌రావు హెచ్చరించారు. మండలంలో రామాయంపాలెం పంచాయతీ పరిధిలో ఉపాధి పథకం ద్వారా సాగు చేసిన ఉద్యానవన పంటలను, స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో రికార్డులను ఆయన శనివారం పరిశీలించారు. ఉపాధి వేతనదారులు పనులు చేస్తున్న సమయంలో వేసవిలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి కూలీలు పనుల దగ్గరకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసినప్పుడే గరిష్ట వేతన పొందొచ్చన్నారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. పనుల్లో కూలీలు సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీఓ జి.రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఏపీఓ మంత్రునాయక్, క్షేత్రస్థాయి సహాయకులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టాలి

● డ్వామా పీడీ అర్జునరావు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

కొనకనమిట్ల: గ్రామాల్లో చేపట్టే ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టి అర్హులైన అందరికీ పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ అర్జునరావు పేర్కొన్నారు. శనివారం ఆయన కొనకనమిట్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పుడూ చేపట్టే పనులు కాకుండా సన్న, చిన్న కారు రైతుల పొలాల్లో ఫారం పాండ్స్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జామ, నిమ్మ, మామిడి మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పనులు చేసే దగ్గర కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. సమావేశంలో ఏపీడీ పద్మశ్రీ, ఎంపీడీఓ టి.సుగుణమ్మ, ఏపీఓ బుల్లెన్నరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు చేస్తేనే వేతనం

దొనకొండ: ఉపాధి హామీ పథకం కూలీలు కొలతల ప్రకారం పని చేస్తేనే గిట్టుబాటు వేతనం చెల్లిస్తామని ఏపీఓ టి.దేవయ్య తెలిపారు. శనివారం మండలంలోని సంగాపురం, వద్దిపాడు, దొనకొండ గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన వేతనం రావాలంటే తప్పని సరిగా కొలతల ప్రకారం పని చేయాలన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో వీలైనంత వరకు ఉదయం పూటనే పనులు ముగించుకోవాలన్నారు. సిబ్బందికి సలహాలు దేవయ్య అందించారు.